క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



నివాళులర్పిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి

వెదురుకుప్పం: మండల కేంద్రంలో ఇటీవల మృతి చెందిన బండి నవనీతమ్మ కుటుంబాన్ని మాజీ ఉప ముఖ్యమంత్రి నారాయణ స్వామి పరామర్శించారు. ఆదివారం వెదురుకుప్పం గ్రామంలో నవనీతమ్మకు కర్మ క్రియలు నిర్వహించారు. గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రి నారాయణస్వామితో పాటు వైఎస్సార్ సీపీ నేతలు నవనీతమ్మ చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమారులు బండి ఉమాపతిరెడ్డి, సభాపతిరెడ్డి, కుటుంబ సభ్యులతో మాట్లాడి యోగక్షేమాలపై వాకబు చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, మాజీ జెడ్పీటీసీ గోవర్ధన్ రెడ్డి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి రామయ్య, బూత్‌కమిటీ జిల్లా ప్రధాన కార్యదర్శి శివాజీ, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రకాష్, మాజీ ఎంపీపీ జ్ఞానమ్మ ఉన్నారు.

మూరిశెట్టి గోవింద్‌కు సాహితీ పురస్కారం



మూరిశెట్టి గోవింద్‌కు సన్మానం

కార్వేటినగరం: సీడీ కండ్రిగ గ్రామానికి చెందిన మూరిశెట్టి గోవింద్‌కు సాహితీ పురస్కారం అవార్డును అందించారు. ఆదివారం తిరుపతిలోని రాస్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవిశ్వసాహితీ సమైఖ్య వారి గార్లపాటి సాహితీ పురస్కారం, కథా నవలా సాహిత్యంలో విశేష ప్రతిభ కనబరిచిన కథా రచయిత మూరిశెట్టి గోవింద్‌కు సాహితీ పురస్కారం అందుకున్నట్లు వారు తెలిపారు. అనంతరం మూరిశెట్టి గోవింద్‌ను అవార్డుతో పాటు, శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.

అప్రమత్తత అవసరం



సీఐ విక్రమ్

నగరి: బంగారం విలువ రోజు రోజుకు పెరుగుతుండడంతో వాటిని కాపాడుకునే విషయంలో ప్రజలకు అప్రమత్తత అవసరమని సీఐ విక్రమ్ అన్నారు. ప్రజల అజాగ్రత్తను అనుకూలంగా మార్చుకొని, మూసి ఉంచిన ఇళ్లు గుర్తించి అర్ధరాత్రి చొరబడి విలువలైన అభరణాలు, నగదు తీసుకువెళ్లిన సంఘటనలు జరిగాయన్నారు. వారిని త్వరలో పట్టుకుంటామన్నారు. ప్రజలు విలువైన ఆభరణాలు జాగ్రత్తగా లాకర్లలో ఉంచాలన్నారు. ఇల్లు లాక్ చేసుకొని వెళ్లాల్సి వస్తే పోలీస్ స్టేషన్‌కు గానీ, ఎస్‌ఐ నెంబరు 9440796724కు గానీ చెప్పి వెళితే రాత్రిపూట గస్తీ తిరిగే సమయాల్లో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఇళ్లకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేవారు రోడ్డువైపు చూపేలా కూడా సీసీ కెమెరా పెట్టుకోవాలని పోలీస్ శాఖ తరపున కోరుతున్నామన్నారు.

పల్లెదారులు దారుణం





ఏళ్ల తరబడి బాగుపడని దేవసేనాపురం రోడ్డు, (ఇన్‌సెట్) పూర్తిగా పాడైన శిరుగురాజుపాళెం-తడుకు రింగ్ రోడ్డు, బురదమయంగా ఆనంబట్టు రోడ్డు

దేశానికి పల్లెలు పట్టుగొమ్మలు అంటారు. అలాంటి పల్లెలకు సరైన రోడ్లు లేక గ్రామీణుల ప్రయాణం కత్తిమీద సాములా తయారైంది. పలు పల్లె ప్రజలు పట్టణాలకు రాకపోకలు సాగించాలంటే నరకయాతన అనుభవిస్తున్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాడు–నేడు కింద గ్రామీణ రోడ్ల అభివృద్ధికి విశేష కృషి చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదిన్నర అవుతున్నా గ్రామీణ రోడ్లు బాగుపడింది లేదు. గత ఏడాది అక్టోబర్ నెలలో పల్లెపండుగ వారోత్సవాలంటూ హడావిడి చేసి చేతులు దులుపేసుకుంది. టీడీపీ నాయకులే చేపట్టిన ఒకటీ అర పనులు సైతం నాసిరకంగా చేశారు. డ్రైనేజీలను అసలు పట్టించుకోలేదు. దీంతో గ్రామీణుల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి.

పుత్తూరు: పల్లెల్లో నివాసం ప్రాణాంతకం కాగా, గ్రామీణ రోడ్లలో ప్రయాణం కత్తిమీద సాములా తయారైంది. వివిధ తుపానుల ప్రభావంతో కురిసిన వర్షాలకు గ్రామీణ రోడ్లు ఛిద్రమయ్యాయి. ఈ రోడ్లపై నడకే కష్టతరంగా ఉంది. ఇక మోటార్ సైకిళ్లు, ఆటో తదితర వాహనాలపై ప్రయాణం అత్యంత ప్రమాదకరంగా మారింది. పుత్తూరు మండలంలోని 14 పంచాయతీల్లో పలు గ్రామాలకు చెందిన రోడ్లు బురదమయంగా దర్శనమిస్తున్నాయి. అలాగే గ్రామాల్లో సరైన డ్రైనేజీలు లేక పల్లె ప్రజలు మురుగు కూపాల్లోనే మగ్గుతున్నారు. రోగాల బారిన పడి, ఆసుపత్రుల పాలవుతున్నారు. కొందరు విష జ్వరాలు సోకి ప్రాణాలు విడుస్తున్నారు. అయినా పాలకులు పల్లెల్లో మౌలిక సదుపాయాలు సమకూర్చడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన పేరిట పుత్తూరు మండలంలో 69 సీసీ రోడ్ల నిర్మాణాలకు రూ.167.53 లక్షలు మంజూరు చేసినట్లు అధికారులు ప్రకటించారు. ఇందులో ప్రారంభమైన 39 పనులు నాసిరకంగా జరిగాయి. గ్రామస్తుల ఆరోపణల మధ్య మిగిలిన పనులను నిలిపివేశారు.



చెరువును తలపిస్తున్న నందిమంగళం రోడ్డు

పుత్తూరు మండలంలోని పంచాయతీలు	14
సచివాలయాలు	10
మండలంలోని గ్రామాల సంఖ్య	82
మొత్తం నివాసాలు	6,273
మంజూరైన రోడ్ల సంఖ్య	69
రోడ్లు వేయాల్సిన దూరం	3,350 మీటర్లు
అంచనా వ్యయం	రూ.167.53 లక్షలు
పూర్తయిన రోడ్ల సంఖ్య	39
రద్దయిన పనుల సంఖ్య	30

కేబీఆర్‌పురం రోడ్లు బాగు చేయాలి



కేబీఆర్‌పురం దళితవాడ నుంచి దేవసేనాపురానికి 850 మీటర్ల రోడ్డు కోసం ఏళ్ల తరబడి ప్రజలు ఎదురు చూస్తున్నారు. ఇక్కడ 150 కుటుంబాలకు చెదిన 600 మంది జనాభా ఉన్నారు. అలాగే 4 కిలో మీటర్ల ఎస్టీ కాలనీ జగన్నాథపురం రోడ్డు, నిశింగదుర్గం యానాది కాలనీకి 4 కిలో మీటర్లు రోడ్డు కోసం ప్రజలు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్నారు. ఇకనైనా పాలకులు రోడ్ల ఏర్పాటుకు తగిన చర్యలు చేట్టాలి.

–టి.కేశవులు, రైతు, కేబీఆర్‌పురం

ఆనంబట్టు రోడ్డు వేసి ఆదుకోండి



వర్షం పడితే మా ఆనంబట్టు గ్రామ రోడ్డు బురదమయమైపోతుంది. మోటర్‌సైకిళ్ల నుంచి జారిపడి చాలా మంది గాయపడిన సంఘటనలు ఉన్నాయి. తారు రోడ్డు వేయాలని ఇది వరకే చిత్తూరు కలెక్టరేట్ వద్ద ఆందోళన చేశాం. అయినా నేటికీ మా గ్రామానికి రోడ్డును బాగు చేయలేదు. పైడిపల్లి గ్రామం నుంచి ఆనంబట్టు గ్రామం వరకు సీసీ రోడ్డు గానీ, తారు రోడ్డు గాని వేయాలి.

–మునెమ్మ, తొరూరు వార్డు మెంబర్, ఆనంబట్టు గ్రామం

రింగ్ రోడ్డును బాగుచేయండి



పుత్తూరు మండల పరిధిలో ఆరు గ్రామాలను కలుపుతూ ఉన్న శిరుగురాజుపాళెం–ఎగువగూళూరు–తడుకు గ్రామాల రింగ్ రోడ్డు దుస్థితికి చేరింది. గత కొంత కాలంగా రోడ్డును బాగు చేయాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు ఇస్తూనే ఉన్నాం. అయినా రోడ్డు బాగుపడింది లేదు. 7 వేల జనాభా కలిగిన ఈ ఆరు గ్రామాల ప్రజలు ఈ రింగ్ రోడ్డు ద్వారానే రాకపోకలు సాగించాల్సి ఉంది. 4 కిలో మీటర్లు కలిగిన ఈ రింగ్ రోడ్డు ఇరువైపులా పిచ్చి మొక్కలు పెరిగిపోయాయి. ప్రయాణం దుర్భరంగా తయారైంది. ఇకనైనా పాలకులు రోడ్డును బాగుచేయాలి.

–వై.బొజ్జయ్య, ఎగువగూళూరు దళితవాడ

ఘనంగా విజయదశమి ఉత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

పెనుమూరు(కార్వేటినగరం): ఆర్‌ఎస్‌ఎస్ చిత్తూరు విభాగ సంఘచాలక్ రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఆదివారం పెనుమూరు ముత్యాలమ్మ ఆలయంలో విజయదశమి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1976లోనే పెనుమూరులో ఆర్‌ఎస్‌ఎస్ శాఖ ప్రారంభం అయ్యిందన్నారు. గ్రామ గ్రామానికి ఆర్‌ఎస్‌ఎస్ శాఖ విస్తరించాలని తెలిపారు. స్వయం సేవకులు టి.గోపాలకృష్ణ, పి.బాలుకిరణ్, జ్ఞానేంద్ర, పరంధామయ్య, జితేంద్రపటేల్, హరికృష్ణ, జయచంద్రా రెడ్డి, సుబ్రమణ్యరెడ్డి, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



కార్వేటినగరం వృద్ధాశ్రమంలో కేక్ పంపిణీ

కార్వేటినగరం: వైఎస్సార్ సీపీ జీడీనెల్లూరు సమన్వయకర్త కళత్తూరు కృపాలక్ష్మి 46వ జన్మదిన వేడుకలను ఆ పార్టీ మండల కన్వీనర్ శేఖర్‌రాజు, రాష్ట్ర రైతువిభాగం కార్యదర్శి చందురాజు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్వేటినగరంలోని వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు పంచిపెట్టారు. స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. అనంతరం సీహెచ్‌సీ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు పంచి పెట్టారు. అనంతరం పుత్తూరులోని ఆమె స్వగృహంలో ఆమెను కలసి పుష్పగుచ్ఛాలతో పాటు శాలువలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయవర్మ, ఉప సర్పంచ్ శేషాద్రి, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, పట్టణ అధ్యక్షురాలు మోహన్‌కుమారి, అంబిక, గోపి, రఫీ, మునికృష్ణ, నందగోపాల్, మురళీ, ధర్మయ్య, ఆరుముగం, శ్రీనివాసులురెడ్డి, అమీద్, తౌకీర్‌ఖాన్, మున్న, శోభన్‌బాబు, త్యాగరాజు, రాజ పలువురు పాల్గొన్నారు.

శిక్షణ సర్టిఫికెట్లు అందజేత



సర్టిఫికెట్లు అందిస్తున్న మాజీ మంత్రి

నగరి: నగరి పట్టణంలో అధ్యాత్మిక ప్రజాసేవా ఉద్యమం 23వ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆ సంస్థ అధ్యక్షుడు జీబీ అన్బలగన్ జన్మదిన వేడుకలను పురస్కరించుకొని, ఆ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్, టైలరింగ్‌లో శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్ల జారీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. మాజీ మంత్రి ఆర్కే రోజా ముఖ్యఅతిథిగా పాల్గొని, శిక్షణ పొందినవారికి సర్టిఫికెట్లు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీ సేవాదళ్ కార్యదర్శి భాస్కర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు రమేష్‌రెడ్డి, నాయకులు బిలాల్ తదితరులు పాల్గొన్నారు.



ఆనాటి అధ్యాపకులతో పూర్వ విద్యార్థులు

పూర్వవిద్యార్థుల సమ్మేళనం

కార్వేటినగరం: 35 సంవత్సరాల అనంతరం డైట్ విద్యార్థులు చేసిన సందడితో జిల్లా విద్యాశిక్షణా సంస్థ డైట్ ఆవరణలో ఆదివారం పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా గతంలో డైట్ ప్రిన్సిపల్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ రంగా రెడ్డి మాట్లాడుతూ 1990 సంవత్సరంలో డైట్‌లో శిక్షణ పొందిన విద్యార్థులు మూడు దశాబ్దాల అనంతరం ఒక్క చోట కలుసుకుని తమ అనుభవాలను పంచుకోవడం అద్భుతమైన విషయమన్నారు. అనంతరం వారికి విద్యాబుద్ధులు నేర్పిన అధ్యాపకులు యోగానందనాయుడు, సుందరయ్య, చిట్టిబాబు, చంద్రయ్య, పురుషోత్తంనాయుడుని శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు చెంగల్రాజు, నీలకంఠం, చెంగల్రాయులు, లావణ్య, నరేంద్ర, భారతి, మురళీ తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేకుండా టపాసులు విక్రయించొద్దు



ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప

పాలసముద్రం: దీపావళి పండుగ సందర్భంగా గ్రామాల్లో అనుమతులు లేకుండా టపాకాయలు విక్రయిస్తే చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. టపాసుల వ్యాపారులు ముందుగా పోలీస్, రెవెన్యూ, అగ్నిమాపక, పంచాయతీ, విద్యుత్ తదితర అన్ని శాఖల అధికారుల నుంచి అనుమతి పొందాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా దుకాణాలు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవన్నారు.

వీధిలైట్లకు కొత్త స్విచ్‌లు



వీధిలైట్లకు స్విచ్‌లు ఏర్పాటు

పాలసముద్రం: రాత్రి సమయంలో మాత్రం వీధి లైట్లు వెలిగేలా చేయాలనే ఉద్దేశంతో ఆదివారం శ్రీకావేరిరాజుపురం సర్పంచ్ గాలి మహేష్‌బాబు ప్రతి విద్యుత్ స్తంభానికి కొత్త స్విచ్‌లు ఏర్పాటుచేశారు. సర్పంచ్ మహేష్ బాబు మాట్లాడుతూ వీధిలైట్లు ఎప్పుడూ వెలుగుతుండడంతో విద్యుత్ వినియోగం పెరిగి బిల్లులు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. అందుకే కొత్తస్విచ్‌లు అమర్చినట్లు తెలిపారు.

కృపాలక్ష్మికి మాజీ మంత్రి శుభాకాంక్షలు



కృపాలక్ష్మికి కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, పక్కన కళత్తూరు నారాయణస్వామి

పుత్తూరు: వైఎస్సార్ సీపీ గంగాధరనెల్లూరు నియోజకవర్గ సమన్వయ కర్త కళత్తూరు కృపాలక్ష్మికి మాజీ మంత్రి ఆర్కే రోజా పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె ఆదివారం పుత్తూరులోని కృపాలక్ష్మి నివాసానికి వెళ్లి పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొన్నారు. కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం కృపాలక్ష్మి తండ్రి, మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామితో కలిసి ప్రస్తుత రాజకీయ పరిణామాలపై చర్చించారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కృపాలక్ష్మి జన్మదిన వేడుకలు గంగాధరనెల్లూరు మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కృపాలక్ష్మి కట్ చేశారు. గుణశేఖర్‌రెడ్డి, హరిబాబు, ఏకాంబరం, అంబోదరపల్లి బాబురెడ్డి, కిషోర్ రెడ్డి, ఢిల్లీ కుమార్, మోసెస్, గోవర్ధన్‌రెడ్డి, రూపకుమార్ రెడ్డి, వేలు మొదలియార్, జయ చంద్రారెడ్డి, వింజం గోవిందయ్య, కడపగుంట పుష్పరాజ్, కొట్రకోన శేఖర్, కేశవరెడ్డి, పెద్దిరెడ్డి, అయ్యప్ప రెడ్డి, జగదీష్ బాబు, సోషల్ మీడియా మదన్, యువరాజ్, గౌతమ్ పాల్గొన్నారు.



జీడీ నెల్లూరులో కేకును కట్ చేస్తున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురంలో..

శ్రీరంగరాజపురం: మండలంలోని 49 కొత్తపల్లిమిట్టలో సమన్వయకర్త కృపాలక్ష్మి జన్మదిన వేడుకలను నిర్వహించారు. దీపిక కళ్యాణ మండపం నుంచి 49కొత్తపల్లిమిట్ట ప్రధాన కూడలి వరకు భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. అనంతరం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహానికి, దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గజమాలతో కృపాలక్ష్మిని సన్మానించారు. పార్టీ మండల అధ్యక్షుడు మణి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శ్యామ్‌రాజ్, జిల్లా క్రియాశీలక కార్యదర్శి కుప్పయ్య, రాష్ట్ర మేధావుల విభాగం కార్యదర్శి రాజన్, ఎంపీపీ సరిత జనార్దన్, ఎంపీటీసీ కోటిరెడ్డిబాబు, కిషోర్, హరిరెడ్డి, సుధ, గోవిందరెడ్డి, శేషాద్రి, మణి, దొరస్వామి, రాజశేఖర్‌రెడ్డి, ఢిల్లీబాబు, రుషి, భరత్, చంద్రరెడ్డి పాల్గొన్నారు.

పల్లె వైద్యంపై సమ్మెట

- గ్రామాల్లో పడకేసిన వైద్యం
- కొనసాగుతున్న పీహెచ్‌సీ వైద్యుల సమ్మె
- వారం రోజులుగా వైద్య సేవలు నిల్
- తీవ్ర ఇబ్బందుల్లో గ్రామీణులు



పీహెచ్‌సీకి వచ్చిన రోగులకు మందుల పంపిణీ



వైద్యులు సమ్మెలో ఉండడంతో ఖాళీగా ఉన్న పాలసముద్రం పీహెచ్‌సీ

పాలసముద్రం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉండే వైద్యులు సమ్మె బాట పట్టడంతో గ్రామీణ ప్రాంతాల ప్రజలకు వైద్య సేవలు దూరమయ్యాయి. తమ సమస్యల పరిష్కారం, డిమాండ్ల నెరవేర్చడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందంటూ వైద్యులు సమ్మెకు దిగడంతో గ్రామీణులకు వైద్య సేవలు అందడం లేదు. అత్యవసర సేవలకు మాత్రమే వైద్యం అందిస్తుండడంతో అప్పులు చేసి మరీ ప్రైవేట్ అస్పత్రులు, క్లినిక్‌లను ఆశ్రయించాల్సిన దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగాఉంది.

నిరసన బాట

డిమాండ్‌ల పరిష్కారమే లక్ష్యంగా సెప్టెంబర్ 28వ తేదీ నుంచి పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రం) వైద్యులు నిరసన బాట పట్టారు. అక్టోబరు ఒకటో తేదీ నుంచి పీహెచ్‌సీ విధులకు దూరమై చలో విజయవాడ కార్యక్రమానికి హాజరయ్యారు. దీంతో వారం రోజులుగా పీహెచ్‌సీలు వెలవెలబోతున్నాయి. వైద్య సేవల కోసం వచ్చే రోగులు కూడా వైద్యులు లేరని తెలుసుకుని వచ్చిన దారినే వెళ్లిపోతున్నారు.

రోజుకు వంద ఓపీలు

సీజనల్ వ్యాధులు ప్రబలేకాలంలో వైద్యులు లేకపోవడంతో గ్రామీణ ప్రాంతాల్లో రోగులు అధికమవుతున్నారు. పాలసముద్రం మండలంలో 13 పంచాయతీలకు ఉన్నాయి. వెంగళరాజుకుప్పం, శ్రీకావేరిరాజుపురం, పాలసముద్రం, సింహరాజుపురం, కేజే పురం, వనదుర్గాపురం, పంచాయతీల్లోని ప్రజలు పీహెచ్‌సీకి వచ్చి వైద్య పరీక్షలు చేసుకునేవారు. బాలక్రిష్టాపురం, ఆముదాల, అలిమేలుమంగాపురం గ్రామ ప్రజలు తూగుండ్రం పీహెచ్‌సీ దగ్గర ఉందని వైద్య పరీక్షలు చేసుకునేవారు. తమిళనాడు సరిహద్దులోని నరసింహపురం, తిరుమలరాజుపురం, గంగమాంబపురం పంచాయతీలకు గత ప్రభుత్వంలో పీహెచ్‌సీ మంజూరు చేశారు. భవనం లేకుండా తాత్కాలికంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. పాలసముద్రం పీహెచ్‌సీలో రోజుకు సగటున వందకు పైగా ఓపీలు వస్తాయి. ప్రస్తుతం రెగ్యులర్ వైద్యులు లేకపోవడంతో వైద్యం కోసం అష్టకష్టాలు పడుతున్నారు.

నిలిచిన 104 వాహన సేవలు

షెడ్యూల్ ప్రకారం గ్రామాలకు 104 సిబ్బంది వెళ్లి రోగులకు బీపీ, షుగర్ చెక్ చేసి తాత్కాలిక మందులు పంపిణీ చేయాలి. 104 వైద్య పరీక్షలకు డాక్టర్ లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. 104 వాహన సిబ్బంది మధ్యాహ్నం వరకు వారికి ఇచ్చిన షెడ్యూల్ గ్రామంలో మందులు పంపిణీ చేస్తున్నారు.

గతమెంతో ఘనం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో గ్రామీణ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందేవి. నాడు–నేడు పేరుతో పీహెచ్‌సీలను అభివృద్ధి చేసి, ఏరియా ఆస్పత్రి తరహాలో వైద్య సేవలు అందించేలా చేశారు. అలాగే ప్రతి సచివాలయం పరిధిలో హెల్త్ సెంటర్ నిర్మించారు. ప్రతి పీహెచ్‌సీలో ఇద్దరు వైద్యులను నియమించారు. ఇప్పుడు వారు సమ్మెబాట పట్టడంతో ప్రజలు కూటమి ప్రభుత్వంపై మండి పడుతున్నారు.

ఇవీ వైద్యుల డిమాండ్లు

సర్వీసులో ఉన్న మెడికల్ ఆఫీసర్లకు గతంలో 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్ క్లినికల్ రిజర్వేషన్ ఉండేది. ప్రస్తుతం ఈ కోటాను 15.30 శాతానికి కుదించారు.

- ఈ ఏడాది జీఓ నెంబర్ 89 ద్వారా ఆరు బ్రాంచ్‌ల నిబంధన తెర మీదకు తెచ్చారు. దీని ప్రకారం 15 శాతానికి కుదించిన క్లినికల్ సీట్ల రిజర్వేషన్ రేడియాలజీ, మెడిసిన్, సర్జరీ, పీడియాట్రిక్స్, గైనకాలజీ, అనస్తీషియా బ్రాంచీలకు మాత్రమే వర్తింపజేసింది. ఈ అన్యాయాన్ని వైద్యులు ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదు.
- మెడిసిన్ చదివినా ఒరిజినల్ సర్టిఫికెట్లు కూడా ప్రభుత్వం తన వద్ద హామీగా పెట్టుకుంటోంది. దీంతో వైద్య వృత్తిలో ఎదుగుదల లేదని, ఇంక పీజీ చదవడం దేనికని పీహెచ్‌సీల వైద్యులు ప్రశ్నిస్తున్నారు.
- వైద్యాధికారిగా నియమితులైన వారు పీజీ చదువుకోవడానికి ప్రభుత్వం అనేక షరతులు పెట్టంది. రూ.50 లక్షలు ష్యూరిటీ ఇవ్వాలని. కనీసం పదేళ్ల ప్రభుత్వ సర్వీసులో అదే హోదాలో పని చేస్తామంటూ బాండ్ రాయాలని చెబుతోంది.
- వైద్యాధికారులకు ఇరవయ్యేళ్లుగా పదోన్నతులు లేవు. వారికి పదోన్నతులు కల్పిస్తామని ఎన్నికల వేళ అసోసియేషన్ నాయకులకు ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం తుంగలో తొక్కింది. ఇప్పుడు ఆ విషయం ప్రస్తావిస్తే కక్ష సాధింపు చర్యలకు పూనుకుంటోందని వైద్యులు ఆరోపిస్తున్నారు.

వైద్యం అందేలా చూడాలి



పాలసముద్రంలో ఉన్న పీహెచ్‌సీ పరిధిలోని ఆరు పంచాయతీల ప్రజలు ప్రభుత్వ వైద్యంపై ఆధారపడుతున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు ఈ పీహెచ్‌సీ పెద్ద దిక్కు. వారానికిపైగా వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి పీహెచ్‌సీ వైద్యులను విధుల్లోకి వచ్చేలా చొరవ తీసుకోవాలి. లేకుంటే గ్రామీణ ప్రజలు ఇబ్బందుల్లో పడతారు.

–అనురేఖ, సర్పంచ్, ఆముదాల

అరకొర వైద్య సేవలు



కొద్ది రోజులకు ముందు కాళ్లకు గాయాలయ్యాయి. ఈ గాయాలతో తీవ్ర జ్వరంతో బాధ పడుతూ చికిత్స కోసం పీహెచ్‌సీలోకి వెళ్లాను. అరకొరగానే వైద్యం అందించారు. వైద్యులు అందుబాటులో లేరన్న విషయం అప్పుడే తెలిసింది. ముఖ్యంగా పేదలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. పూర్తిస్థాయి చికిత్స కోసం ప్రైవేట్ ఆస్పత్రులపై ఆధారపడాల్సి వస్తోంది. వైద్యులు తక్షణమే విధుల్లోకి వచ్చేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాలి.

–గోవిందరాజ్, శ్రీబొమ్మరాజుపురం, ఆదిఆంధ్రవాడ

వైభవంగా శివ మహోత్సవం



ఉపదేశం చేస్తున్న జంబులింగం స్వామి

నగరి: శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర ఆలయంలో ఆదివారం ప్రపంచ శివసేవకుల అసోసియేషన్ గుర్తింపు కార్డుల జారీ నిమిత్తం శివమహోత్సవ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. తమిళనాడు శైవ సేవకుల కోఆర్డినేటర్ ఈశ్వరన్ స్వామి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. తమిళనాడు రాష్ట్ర శైవసేవక అసోసియేషన్ కార్యదర్శి జంబులింగం స్వామి భక్తులకు పంచపురాణం, తిరువాసగంపై ఉపదేశం చేశారు. అనంతరం అసోసియేషన్ గుర్తింపు కార్డులను సేవకులకు అందించారు. భక్తులందరికీ ఆలయం వద్ద సహపంక్తి భోజనం పెట్టారు. నగరి, పుత్తూరు మాణిక్యవాసగర్ శివసేవకుల అసోసియేషన్ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

స్వదేశీ వస్తువులు వాడాలి

గంగాధరనెల్లూరు: బీజేపీ ఆదేశాల మేరకు స్వదేశీ వస్తువులే వాడాలని ఆ పార్టీ మండల కార్యాలయంలో ఆదివారం ఆత్మ నిర్భర్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. స్వదేశీ వస్తువులు అధికంగా వాడాలని, పర్యావరణాన్ని కాపాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఆనందబాబు, సుధాకర్, భాగ్యలక్ష్మి, మురళి, నటరాజన్, నారాయణ ఆచారి పాల్గొన్నారు.